
## పూర్తి సహకారం అందిస్తాం

**టన్నెల్ ప్రమాదంపై ప్రధాని మోదీ సీఎం రేవంత్‌కు ఫోన్**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి సంబంధించి అన్ని విధాలుగా సహకరిస్తామని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసిన ఆయన ఈ మేరకు హామీ ఇచ్చారు. ఘటన జరిగిన తీరు, సహాయక చర్యలపై ఆరా తీశారు. సీఎం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టామని తెలియజేశారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని ప్రధానికి వివరించారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ సహాయక చర్యల కోసం వెంటనే ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని పంపిస్తామని, పూర్తిస్థాయిలో సహకారం అందించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.

## ప్రమాదానికి రేవంత్‌దే బాధ్యత

**కాంట్రాక్టర్‌ను రక్షించేందుకు యత్నాలు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదానికి సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. సుంకిశాలలో రిటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువక ముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శమని పేర్కొన్నారు. 'కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్ల వేటలో పర్యవేక్షణ గాలికొదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడటం వల్లే ఇలాంటి వరుస ఘటనలు జరుగుతున్నాయి. పైకప్పు కూలిన ఈ ఘటనలో లోపల చిక్కుకున్నవారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి. ఇలాంటి దుర్ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడకుండా నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ఈ వరుస వైఫల్యాలపై ఏం సమాధానం చెప్తారు. సుంకిశాల ప్రమాదంలో కాంట్రాక్టర్‌ను కాపాడేందుకు వాస్తవాలు దాచిపెట్టిన ప్రభుత్వం, కనీసం ఎస్ఎల్‌బీసీ సంఘటనపై అయినా పారదర్శకంగా దర్యాప్తు జరిపి, ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలి' అని డిమాండ్ చేశారు.

## అసమర్థ పాలన వల్లే ప్రమాదం

**ఎన్డీఎస్ఏతో విచారణ జరిపించాలి**

**మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానికితనానికి ఈ ఘటన నిదర్శనమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. చేయక.. చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులకే దక్కుతుందని ఆయన దుయ్యబట్టారు. 'మొన్న సుంకిశాలలో రిటైనింగ్ వాల్ కూలిన ఘటన.. నేడు ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలడం కాంగ్రెస్ కమీషన్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా మట్టి కూలుతున్నదని గుర్తించినప్పటికీ ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. లోపల చిక్కుకుపోయిన కార్మికులను క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్తు సరఫరా పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలి' అని డిమాండ్ చేశారు.

### లోకం పోకడ




## తక్షణ చర్యలు చేపట్టండి

- ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై సీఎం రేవంత్ ఆదేశాలు
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- మంత్రి ఉత్తమ్‌తో కలిసి సమీక్ష



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, అగ్నిమాపక శాఖ, హైడ్రా, ఇరిగేషన్ విభాగం అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు అందించాలని సీఎం సూచించారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సాయం అందించాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, అధికారులు ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం హైదరాబాద్‌కు తిరిగొచ్చిన మంత్రి ఉత్తమ్, ఆదిత్యనాథ్ దాస్, వేం నరేందర్‌రెడ్డితో కలిసి రాత్రి సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత పరిస్థితులు, చేపట్టిన సహకార చర్యలపై సీఎంకు మంత్రి ఉత్తమ్ వివరించారు.

## టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడాలి

**రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్ డిమాండ్**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఇద్దరు ఇంజినీర్లతోపాటు 8 మంది కార్మికులను కాపాడాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్ డిమాండ్ చేశారు. టన్నెల్ పనులు పూర్తయ్యేంత వరకు రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.



సహాయక చర్యలు చేపట్టేందుకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందం



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదం గురించి తెలుసుకుంటున్న అధికారులు, పోలీసులు

# ప్రచారం తప్ప పట్టింపేది?

**పేరు కోసం ప్రాజెక్టు పణం**

- ముందస్తు చర్యలపై దృష్టిసారించని సర్కార్
- ఇదే ఎస్సెల్బీసీ ప్రమాదానికి కారణం
- ప్రభుత్వ తీరుపై ఇంజినీర్ల విమర్శలు
- నోరెత్తదంటూ అధికారులకు సర్కార్ హుకూం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్సెల్బీసీ) ప్రాజెక్టు సొరంగం కూలిన ఘటనకు సర్కార్ ప్రచార యావ తప్ప మరేమీ కాదని ఇంజినీర్లు బాహాటంగానే విమర్శిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పినా వినకుండా, పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టనీయకుండానే పనులను చేపట్టాలని హడావుడి చేయడమే ప్రస్తుత ప్రమాదానికి కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు ద్వారా నల్లగొండ జిల్లా కరువు పీడిత ప్రాంతాల్లో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, 516 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటిని అందించాల్సి ఉన్నది. అందుకోసం 30 టీఎంసీల జలాలను శ్రీశైలం రిజర్వాయర్ జలాశయం నుంచి రెండు సొరంగాల ద్వారా గ్రావిటీ ద్వారా తరలించాలనే లక్ష్యంతో ఎస్సెల్బీసీ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 2005లో పనులు ప్రారంభమయ్యాయి. అయితే టన్నెట్ బోర్ మిషన్ (టీబీఎం) టెక్నాలజీ ద్వారా పనులను చేపట్టడం, క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలు, తదితర సవాళ్ల నేపథ్యంలో సొరంగాల తవ్వకం పనులు తీవ్ర జాప్యమవుతున్నాయి. రెండు దశాబ్దాలుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తంగా 43.93 కిలోమీటర్ల మేర టన్నెల్‌ను తవ్వాల్సి ఉండగా, రెండు దశాబ్దాల్లో తవ్వింది 34.372 కిలోమీటర్లు మాత్రమేనంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇంకా 9.56 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వకం పనులను పూర్తి చేయాల్సి ఉన్నది. ప్రస్తుతం గతంలో ఎన్నడూ ఊహించని రీతిలో సొరంగం కూలిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది ముమ్మాటికీ సర్కార్ వైఫల్యమేనని ఇంజినీర్లు మండిపడుతున్నారు.

### చెప్పినా వినని ప్రభుత్వం

43.93 కి.మీ సొరంగం పనులను రెండు వైపుల నుంచి ప్రారంభించారు. ఒకవైపు శ్రీశైలం ముఖద్వారం నుంచి (ఇన్‌లెట్) అంటే దోమలపెంట నుంచి, మరోవైపు నల్లగొండ జిల్లా మన్యవారిపల్లి నుంచి టన్నెల్ తవ్వకాన్ని ప్రారంభించారు. ఇన్‌లెట్ ఎండ్ నుంచి 13.937 కి.మీ, అవుట్‌లెట్ నుంచి 20.435 కి.మీ మేర సొరంగం పని పూర్తయింది. ఇంకా 9.56 కి.మీ మేర సొరంగం తవ్వాల్సి ఉన్నది. టీబీఎం బేరింగ్ బ్రేక్ అవడంతో అవుట్‌లెట్ టన్నెల్ పనులు ఇప్పటికే నిలిచిపోయాయి. భారీ సీపేజీ కారణంగా ఇన్‌లెట్ టన్నెల్ ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నవిధంగా ఆగుతూ, సాగుతూ వస్తున్నాయి. నిమిషానికి పదివేల లీటర్ల చొప్పున సొరంగంలో ఊట వస్తున్నదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సీపేజీని అరికట్టేందుకు దాదాపు మూడు లక్షల క్యూబిక్ మీటర్ల సిమెంట్ గ్రౌటింగ్ చేశారు. అయినప్పటికీ నీటి ఊట నిలిచిపోని పరిస్థితి. కెమికల్ గ్రౌటింగ్ కూడా చేయడం ప్రారంభించారు. లోపల భూమి పొరలు ఒకే విధంగా లేకపోవడంతో ఒకచోట వినియోగించిన కెమికల్ గ్రౌటింగ్ మరోచోట పనిచేయని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో చాలా జాగ్రత్తగా, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేస్తూ, డీవాటరింగ్ చేస్తూ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తూ పనులను చేయాల్సి ఉంటుంది. సూటిగా చెప్పాలంటే ఇన్‌లెట్‌లో పనులు చేపట్టడం కత్తిమీద సాములాంటిదని ఇంజినీర్లు వివరిస్తున్నారు. ఈ పరిస్థితులన్నీ వివరించినా ప్రభుత్వం పెడచెవిన పెడుతూ వచ్చిందని, పనులు చేయాల్సిందేనంటూ ఒత్తిడి చేస్తూ, మెడ మీద కత్తిపెట్టినంత పనిచేసిందని చెప్తున్నారు. పటిష్ట రక్షణ చర్యలు, గ్రౌటింగ్ నిర్వహించకుండా పనులను ముందుకు తీసుకెళ్లడం వల్లే ప్రస్తుతం మట్టి, సిమెంట్ కప్పులు కూలిపోయాయని వివరిస్తున్నారు. ప్రభుత్వ తొందరపాటు, ఒత్తిడే ఘటనకు ప్రధాన కారణమని ఇంజినీర్ నిపుణులు వివరిస్తున్నారు.

### నోరెత్తద్దంటూ హుకూం

ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం ఒక్కసారిగా కలవరానికి గురైంది. వివరాలు ఎక్కడా పొక్కనీయకుండా జాగ్రత్తపడింది. ఉదయం 8.20 గంటలకు ప్రమాదం సంభవించినా 10.30 గంటల వరకు కూడా విషయం బయటకు రాలేదు. అధికారులు ఎవరూ నొరెత్తవద్దంటూ హుకూం జారీ చేయడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. దీంతో ఘటనపై వివరాలను చెప్పేందుకు ఏ ఒక్క అధికారి కూడా ముందుకు రాలేదు. సొరంగంలోకి పనులకు వెళ్లి, ప్రాణాలతో బయటపడిన కార్మికులను సైతం ప్రభుత్వం ప్రత్యేకంగా ఉంచింది. ఇతరులెవరూ వారిని కలవకుండా కట్టుదిట్టం చేసింది. లోపల ఏం జరిగిందో తెలుసుకునే అవకాశం ఎవరికీ ఇవ్వలేదు. మీడియాకు సైతం లోపలికి వెళ్లేందుకు అనుమతివ్వలేదు. అధికారులను, కార్మికులను కలవనీయకుండా అడ్డుకున్నది. ప్రమాద విషయం బయటకు పొక్కడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హడావుడిగా అక్కడి వెళ్లారు. ఆ తరువాత సహాయక చర్యలు చేపడుతున్నామంటూ ప్రకటనలు ఇచ్చారు.

### అడుగడుగునా ప్రచార యావే

ప్రభుత్వం ప్రచారంపై దృష్టి పెట్టింది తప్ప సొరంగం తవ్వకానికి ఎదురవుతున్న సవాళ్లు, వాటి నివారణ చర్యలపై ఎప్పుడూ దృష్టి పెట్టలేదని నిపుణులు మండిపడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎస్సెల్బీసీ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకసారి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలుమార్లు ఎవరికి వారు సమీక్షలు పెట్టడం, ప్రచారం చేసుకోవడం తప్ప క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎనాడూ దృష్టి సారించలేదని ఇంజినీర్లు చెప్తున్నారు. కనీసం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో సందర్శించిన దాఖలాల్లేవని వివరిస్తున్నారు. అమెరికా వెళ్లి కంపెనీ ప్రతినిధులతో చర్చించి పరికరాలను తెప్పిస్తున్నామని చెప్పినప్పటికీ, ఇప్పటికీ అవుట్‌లెట్‌లోని టీబీఎంకు సంబంధించిన బేరింగ్ రాలేదు. ప్రాజెక్టుకు భారీగా నిధులను కేటాయించామని చెప్తున్నా.. ఇప్పటివరకు విడుదల చేసింది రూ.60 కోట్లు మించలేదు. అడుగడుగునా కాంగ్రెస్ నేతలు ప్రచారంపై, రాజకీయాలపై దృష్టి పెట్టారు తప్ప, ప్రాజెక్టు రక్షణ చర్యలపై ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదని ఇంజినీర్లు, నిపుణులు వివరిస్తున్నారు.

## పనులు మొదలుపెట్టగానే ప్రమాదమా?

**కేసీఆర్ హయాంలో 10 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వినా ఒక్క ప్రమాదం జరగలే**

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ పనులు మొదలుపెట్టగానే ప్రమాదం ఎలా జరిగిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో 10 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వినా ఏ ఒక్క రోజూ ఇలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు రోజుల కిందటే పనులు మొదలుపెట్టింది. అంతలోనే పెను ప్రమాదం ఎలా జరిగింది? దీనికి బాధ్యులెవరు? ఈ ప్రమాదంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) స్పందించాలి. ప్రాజెక్టులో ఇంకా 9 కిలోమీటర్లకు పైగా సొరంగం తవ్వాల్సి ఉంది. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలి. కూలీలు గాయపడటం అత్యంత దురదృష్టకరం. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలి' అని డిమాండ్ చేశారు.

# ఈ పాపం ఎవరిది? ఆ శాపం ఎవరికి?

- నాడు చలివాగు కింద ముగ్గురు జలసమాధి
- నేడు 8 మంది జాడ అంతుపట్టని దైన్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): దగాపడ్డ తెలంగాణపై కాంగ్రెస్ పిడుగు. కుప్పకూలిన ఎస్ఎల్బీసీ సొరంగం. మట్టిపొరల కింద నాలుగు రాష్ట్రాలకు చెందిన 8 మంది కూలీలు.. నీటిజలమాటున వారి యోగక్షేమాలు ఎలా ఉన్నాయో? యావత్‌దేశం ఉలిక్కిపడ్డది. కాంగ్రెస్ ఏలుబడిలో సాగునీటి ప్రాజెక్టుకు సొరంగముప్పునకు గురికావటం ఎస్ఎల్బీసీ రెండోది. 2011లో దేవాదుల సొరంగం కుప్పకూలి చలివాగు కింద ముగ్గురు జలసమాధి అయ్యారు. ఎస్ఎల్బీసీలో చిక్కుకున్న 8 మంది కార్మికులు, సిబ్బంది సురక్షితంగా బయటకు రావాలని యావత్ ప్రపంచం ఆశిస్తున్నది. వారి ప్రాణాలకు ఏ ప్రమాదం రాకూడదని తలపోస్తున్నది. ప్రమాదాన్ని మరో ప్రమాదంతో ముడిపెట్టకూడదు. కానీ, ఎస్ఎల్బీసీ సొరంగం పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చూపించిన అత్యుత్సాహం, పదేండ్ల బీఆర్ఎస్ పాలనను అపహాస్యం చేయాలని కంకణం కట్టుకున్న వైనం చివరికి వారికే భస్మాసుర హస్తం అయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 42 కిలోమీటర్ల సొరంగాన్ని అభయారణ్యం మధ్య నుంచి ప్రాజెక్టు డిజైన్ చేయటమే అసలు కుట్ర. ఆ కుట్రకు సంపూర్ణ బాధ్యత కాంగ్రెస్ పార్టీదే. సొరంగం పనుల్లో దశాబ్దాల జాప్యానికి... పనులు సాగకపోవటానికి ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు నమూనాయే కారణమని సాగునీటిరంగ నిపుణులు ఆరోపిస్తున్నారు.

### మేడిగడ్డ పిల్లర్ పర్రెకే ప్రపంచ నష్టంగా చాటింపేసి...

ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా రికార్డు సృష్టించిన కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బరాజ్ పిల్లర్ కుంగితేనే కాంగ్రెస్ పార్టీ దాన్ని భూతద్దంలో పెట్టి నానా హంగామా చేసింది. మొత్తం ప్రాజెక్టే కొట్టుకుపోయినట్టు బద్నాం చేసింది. ఇప్పటికీ కాళేశ్వరం పేరుతో రాజకీయాలు చేయటానికి బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ కాలుదువ్వుతున్నది. అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు పూర్తి కావస్తున్నా కావాలనే ప్రభుత్వం మేడిగడ్డకు మరమ్మతులు చేయటానికి ముందుకు రావటం లేదు. కేసీఆర్ మీద కోపంతో కాళేశ్వరాన్ని పడావుపెట్టి భూములను బీడు చేయాలని కాంగ్రెస్ ప్రయత్నించిందనే ఆరోపణలు ఉన్నాయి. అంతపెద్ద బరాజ్‌లో పిల్లర్లపై చిన్న పర్రె పడితే దాన్ని ప్రపంచ నష్టంగా చిత్రీకరించిన కాంగ్రెస్ పార్టీ అక్కడికి రాహుల్‌గాంధీని తీసుకుపోయి నానా యాగీ చేసింది. కానీ, ఇప్పుడు ఎస్ఎల్బీసీ సొరంగంలో చిక్కుకున్నవారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, జార్ఖండ్ నుంచి నలుగురు, పంజాబ్, జమ్మూకశ్మీర్ నుంచి ఒకరు చొప్పున మొత్తం 8 మంది ఉన్నారు. వారి ప్రాణాలు ఊగిసలాడుతున్నాయి. ఈ పాపం ఎవరిది? ఆ ఎనిమిది మంది కుటుంబాల శాపం ఎవరికి తగులుతుంది?

### తొక్కిపెట్టాలని అనుకున్నా...

ఎస్ఎల్బీసీ సొరంగం ప్రమాదం ఉదయం 8.30 గంటలకు జరిగితే దాన్ని ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాద తీవ్రత తెలిసినా ప్రభుత్వ పెద్దలు పెద్దగా స్పందించలేదని అధికారవర్గాలు చెవులు కొరుక్కుంటున్నారు. సొరంగంలో చిక్కుకున్నది ఉత్తరభారతానికి చెందినవారు కావడం, జాతీయ మీడియాలో విస్తృతంగా సొరంగ ప్రమాదం ప్రచారం కావటంతో అప్రమత్తమైన ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగినా పెద్దగా ఫలితం లేకుండాపోయిందని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

### 2011లో చలివాగు కింద ముగ్గురు

ఉమ్మడి వరంగల్ జిల్లా శాయంపేట మండలంలోని చలివాగు కింద దేవాదుల మూడో దశలో భాగంగా తవ్వుతున్న సొరంగ పనుల్లో ప్రమాదం సంభవించి ముగ్గురు కూలీలు జలసమాధి అయ్యారు. తెలంగాణ ఉద్యమ ధాటికి దేవాదులను పూర్తిచేస్తామని ఎటువంటి సాంకేతిక, ముందస్తు ఏర్పాట్లు లేకుండా సొరంగ ఉపరితలంపై చెరువు ఉందని తెలిసినా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలకు పోవటం వల్లే ప్రమాదం చోటుచేసుకున్నదని నిపుణులు అప్పట్లో తేల్చిచెప్పారు. ఇప్పుడూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎస్ఎల్బీసీని ఏమీ చేయలేదని తాము మాత్రమే చేస్తామనే గొప్పలకుపోయి పనులు ప్రారంభించిన నాలుగు రోజులకే దుర్ఘటన చోటుచేసుకోవటం సర్వత్రా విమర్శలకు తావిస్తున్నది.



ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం



ధర్పల్లి మండలం గుడితండాలో పొలంలో మేత మేస్తున్న గొర్రెలు

## వట్టిపోతున్న బోర్లు.. ఎండుతున్న పంటలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చి'వరి' తడికోసం రైతన్నల పాట్లు
- పశువులకు దాణాగా పచ్చని పొలాలు
- పట్టించుకోని అధికారులు

**నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో సాగునీటి కష్టాలు**

ధర్పల్లి, ఫిబ్రవరి 22 : పదేండ్లు ఆనందంగా ఉన్న రైతన్న నేడు ఆందోళన చెందుతున్నాడు. ఏడాదికాలంగా ఆగమవుతున్నాడు. పంటకు చివరి తడులు అందక అల్లాడిపోతున్నాడు. వరి వేసిన నేల నీరందక నెర్రెలు బారి పచ్చని పంట పొలాలు కండ్ల ముందే ఎండిపోతుంటే ఏం చేయాలో తెలియక రైతు గుండె తరుక్కుపోతున్నది. ఎన్ని ప్రయత్నాలు చేసినా పంటను రక్షించుకోలేక ఎండిన పంటను చూస్తూ తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో యాసంగి పంటలు వేసిన రైతులకు కన్నీరే మిగులుతున్నది. రోజురోజుకూ భూగర్భజల వనరులు అడుగంటి పోతుండటంతో పంటలు సగానికి సగం ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. మండల కేంద్రంలోని భీమ్‌గల్ రోడ్డు వాడీ, హోన్నాజీపేట్ గ్రామాల పరిధిలో, దుబ్బాక, గోవిందుపల్లి గుడి తండా గ్రామాల పరిధిలో వరికి నీరందక ఎండిపోతున్నాయి. గతంలో చివరి తడులకు నీరందక ఎండిపోయే పరిస్థితులు వస్తుండే.. కానీ ప్రస్తుతం చివరి తడుల కన్నా ముందుగానే పంటలకు నీరందక ఎండిపోవడం ఇదే మొదటిసారని రైతులు ఆవేదన చెందుతున్నారు. చివరి తడులు మార్చి, ఏప్రిల్ వరకు అందక ఎండిపోతుండే. కానీ ఫిబ్రవరిలోనే భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటిపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి. బోర్లలో నీరు రాక వేసిన పంటలను రక్షించుకోలేక సగం పంటను పశువులకు మేత కోసం వదిలేస్తున్నారు. మిగతా సగం పంటలకే నీళ్లు పట్టిస్తూ కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు.

### పోలీసు బందోబస్తు మధ్య నీటి విడుదల

నడిమి తండా పరిధిలోని ముత్యాల వాగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు వెళ్లగా నడిమి తండా వాసులు అడ్డుకొన్నారు. వారం రోజులైన సమస్య కొలిక్కిరాకపోవడంతో శుక్రవారం ఇరిగేషన్ ఏఈ రాంప్రసాద్ పోలీసుల రక్షణతో ముత్యాల వాగు ప్రాజెక్టు నుంచి లక్ష్మీ చెరువు తండా, ఊర చెరువుకు నీటిని విడుదల చేయడం గమనార్హం.


**కళ్యాణమస్తు**

..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

**శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో**

రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy, Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439



| వధువు కావలెను | వరుడు కావలెను |
| --- | --- |
| ★రెడ్డి:27 Yrs, 5'8", B.Tech., MS, SWE, USA, 150K P/A, 60 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9030315599 | ★రెడ్డి:26 Yrs, 5'5", B.Tech, MS, SWE, USA, 130K P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599 |
| ★రెడ్డి:28 Yrs, 5'10", B.Tech (Bits Pilani), SWE, Hyd, 27 Lakhs P/A Well Settled గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888 | ★రెడ్డి:25 Yrs, 5'4", MBA, Hr. Manager, 1 Lakh P/M, Hyd, 50 Cr. ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★కాపు:27 Yrs, 6 Ft, B.Tech, Business, Analyst, Hyd, 16 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229 | ★కాపు: 26 Yrs, 5'4", B.Tech, SWE, Bangalore, 13 Lakhs P/A, Well Settled గల వధువుకు తగిన వరుడు కావలెను. 9701960229 |
| ★మున్నూరుకాపు:28 Yrs, 5'8" M.Tech (IIT), SWE, Hyd, 20 Lakhs P/A గల వరుడికి వధువు కావలెను. 9010051444 | ★మున్నూరుకాపు:25 Yrs, 5'3", B.Tech, SWE, Hyd, 80,000/- P/M గల వధువుకు తగిన వరుడు కావలెను. 9010051444 |
| ★పద్మశాలి:28 Yrs, 5'8", B.Tech, SWE, Hyd, 11 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777 | ★పద్మశాలి:26 Yrs, 5'4", B.Tech, SWE, Hyd, 8 Lakhs P/A, Well Settled గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777 |
| ★ముదిరాజ్:27 Yrs, 5'9", B.Tech, SWE, Hyd, 12 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 7207930999 | ★గౌడ్స్:25 Yrs, 5'5", M.Tech., SWE, 1 Lack P/M, Hyd గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★SC-మాల: 27 Yrs, 5'7', B.Tech, SWE, Hyd, 14 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229 | ★SC-మాల:26 Yrs, 5'4", B.Tech, SWE, Hyd, 12 Lakhs P/A, Well Settled గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999 |
| ★ SC-మాదిగ:28 Yrs, 5'9", M.Sc., Business Analyst, 1 Lakh P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9010051444 | ★SC-మాదిగ:27 Yrs, 5'2", B.Tech, IIT, MBA, (IIM), Product Manager, Bangalore, 40 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599 |
| ★CASTE NO BAR:28 Yrs, 6 Ft, MBA, SWE, Hyd, 12 Lakhs P/A, 20 Cr. ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. 7207930999 | ★మున్నూరుకాపు-CASTE NO BAR: 26 Yrs, 5'6", B.Tech, MS, USA, SWE, USA, 1 Cr. P/A (20 Cr. ప్రాపర్టీ) గల వధువుకి వరుడు కావలెను. 9248064777 |
| ★రెడ్డి-CASTE NO BAR-2nd Match: 37 Yrs, 6 Ft, B.Tech, MBA, SWE, USA, 250K P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599 | ★CASTE NO BAR-2nd Match: 33 Yrs, 5'4", B.Tech, SWE, Hyd, 12 Lakhs P/A గల వధువుకు వరుడు కావలెను. 9030315599 |

**VIP'S MP REDDY MATRIMONY**

30 సంవత్సరముల అనుభవం గల సంస్థ

అన్ని కులముల డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బిజినెస్, ప్రైవేట్ జాబ్స్ మరియు దేశ, విదేశ వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి. ఫాస్ట్ సెటిల్‌మెంట్.

CONTACT: M.P. REDDY Executive Service
94 93 93 93 93
Head Office: Banjara Hills, Road No.2, Near TV9

4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం) ప్రతి అదనపు లైనుకు 125/-
9848077857